క్లుప్తంగా

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు



డొంకేశ్వర్: ఎన్నికల కమిషన్‌తో పాటు కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల కోసం మండలంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ పి వెంకటరమణ తెలిపారు. మంగళవారం వివరాలను వెల్లడించారు. మండలంలో మొత్తం 13 జీపీలు ఉండగా, 19 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. అలాగే మండలంలో 16,616 మంది ఓటర్లు ఉండగా ఇందులో 8,982మంది మహిళలు, 7,634మంది పురుషులు ఉన్నారని పేర్కొన్నారు. బీఎల్వోల ద్వారా ఇంటింటికీ ఓటరు స్లిప్పులను పంపిణీ చేశామని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు.

డీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం



పెర్కిట్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజ్యాధికారం ధర్మ సమాజ్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ లోక్‌సభ అభ్యర్థి కండెల సుమన్ అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా సుమన్ మాట్లాడుతూ.. బహుజనులందరూ ధర్మ సమాజ్ పార్టీకి అనుకూలంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్, నాయకులు కాన్షీరాం తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలి



పెర్కిట్: లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దాసు పిలుపునిచ్చారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఆదర్శనగర్ కాలనీలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా దాసు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక బీజేపీ పార్టీని ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్య శివాజీ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



మాక్లూర్: ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారధన్ మహరాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఆర్మూర్‌లో చేపట్టే బహిరంగ సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ముఖ్యకార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆర్మూర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సాయిలు, గంగాధర్, లక్ష్మణ్, శివప్రసాద్, శ్రీహరి, మనీష్ పాల్గొన్నారు.

బుద్దె రాజేశ్వర్ కుటుంబానికి పరామర్శ



బోధన్: సాలూర మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు, బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త రాజేశ్వర్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా కుటుంబ సభ్యులను కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. వారి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలో నేడు వాణిజ్య శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో 'డిగ్రీ, పీజీ పట్టభద్రుల కేరియర్, ఉన్నత విద్యలో అవకాశాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కోరుట్ల ప్రభుత్వడిగ్రీ కళాశాలతో కలిసి ఒక రోజు జాతీయ వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



తారువేయని జన్నేపల్లి వంతెన

మాక్లూర్: మండలంలోని చిక్లి శివారులో ఉన్న జన్నేపల్లి వంతెనపై చేపడుతున్న అసంపూర్తి పనులతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ కరవుతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శిథిలావస్థకు చేరిన 200 మీటర్ల పొడవున ఈ వంతెన గత పదేళ్ల క్రితం అప్పట్లో కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. నాటి అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. కాగా గతేడాది కురిసిన భారీ వర్షాలకు మరమ్మతులు చేపట్టిన ప్రాంతం కుంగిపోయింది. దీంతో వంతెనపై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షం కురిసిన ప్రతిసారి మోకాలు లోతు వరకు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. వంతెన మరమ్మతుల విషయమై సాక్షి నాడు ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రూ. రెండు లక్షల నిధులు మంజూరు చేసి కాంట్రాక్టర్‌లతో పనులు మొదలు పెట్టారు. కాంట్రాక్టర్ ఈ వంతెనపై రోడ్డుకు సగభాగం మరమ్మతులు చేసి వదిలి పెట్టారు. సుమారు నాలుగు నెలలు కావస్తున్నా మిగతా పనులు పూర్తి కావడం లేదు. ఫలితంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తి పనులతో రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటనే వాహనదారులు జంకుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న ఈ వంతెన రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నాలుగు నెలలుగా ఇబ్బందులు



అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు పనులతో నాలుగు నెలలుగా వంతెన నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీంతో రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. పలువురు ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాలయ్యాయి. అధికారులు స్పందించి అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలి

– శిలారి సుధాకర్, వల్లభాపూర్

వారంలో పూర్తి చేయిస్తా

చిక్లి శివారులోని జన్నేపల్లి వంతెనపై పెండింగ్‌లో ఉన్న మరమ్మతుల పనులను వారంలో పూర్తి చేయిస్తా. కాంట్రాక్టర్ దగ్గరి బంధువు మృతి చెందడంతో మరమ్మతు పనులు నిలిచిపోయాయి. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– గులాబ్‌సింగ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, మాక్లూర్

పసుపు రైతులను మోసం చేశారు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఆర్మూర్: పసుపు రైతులను మోసం చేసిన నిజామాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను ఓడించాలంటూ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు కోరారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలోని కుమార్‌నారాయణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేందర్‌రెడ్డి, దేవరాం, లింగారెడ్డి మాట్లాడారు. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో పసుపు, ఎర్రజొన్న రైతులు చేసిన ఉద్యమాన్ని తన రాజకీయ భవితవ్యం కోసం మలుచుకున్నాడని ఆరోపించారు. నాడు ఉద్యమించిన రైతులపై కుట్రపూరితంగా పెట్టిన కేసులు నేటికి కొనసాగుతున్నాయని, కేసుల రద్దు విషయం కూడా అర్వింద్ పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ఎన్నికల వేళ ప్రధాన మంత్రితో ప్రకటన చేయించినప్పటికీ గెజిట్‌లో స్పష్టత లేకపోవడం బీజేపీ చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తోందన్నారు. అర్వింద్‌ను ఎన్నికల్లో ఓడించాలన్నారు. సమావేశంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఆకుల గంగారాం, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి యాదవ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఆర్మూర్: దేశంలో సామాజిక న్యాయం నిలబడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఓటేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉన్న తాటిపర్తి జీవన్‌రెడ్డి విజయంతో పార్లమెంట్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తవుతాయన్నారు. భారతదేశ స్వాతంత్ర పోరాటంలో ఎలాంటి పాత్రలేని రాజకీయ పార్టీ నేడు దేశ పాలకులుగా కొనసాగడం శోచనీయమన్నారు. అవినీతిపరులు ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసి బీజేపీలో చేరితే నిజాయితీపరులుగా మారిపోతారనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ప్రత్యేక దృష్టి



మోపాల్: మండలంలోని 45 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో లింగం నాయక్ సూచించారు. మోపాల్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లింగం నాయక్ మాట్లాడుతూ.. మే 13న 45 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది అసౌకర్యాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా, టేబుళ్లు, వీల్ చైర్లు, టెంట్లు, తాగునీటి వసతి, తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు చేశారు. తహసీల్దార్ రామేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన వారితో సునీల్‌రెడ్డి

మోర్తాడ్/ రెంజల్: మోర్తాడ్ మండలంలోని వడ్యాట్ ఎంపీటీసీ సభ్యురాలు కళావతి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో మంగళవారం చేరారు. వీరికి ఆయన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్‌ఎస్ నుంచి నర్సాగౌడ్, నిమ్మల నర్సారెడ్డి, కొడిమెల శ్రీనివాస్‌గౌడ్, మర్రి చిరంజీవి, బొడ్డు నవీన్ రెడ్డి, చిన్నా రెడ్డి, ముత్యాగౌడ్, చంద్రకాంత్ రెడ్డి, రాజుగౌడ్, పాల్‌రెడ్డి, దయానంద్ తదితరులు ఉన్నారు. రెంజల్ మండలంలోని దండిగుట్టకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ మండల నాయకుడు దనంజయ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పీర్యా, సాయికుమార్, రవి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో అల్లూరి వర్ధంతి



ఆర్మూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



బోర్గాంలో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రెంజల్/ నందిపేట్/ మాక్లూర్/ ఆర్మూర్ టౌన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని రెంజల్ మండలంలోని బోర్గాం గ్రామంలో మంగళవారం నిర్వహించారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ ప్రతినిధులు ఒడ్డెన్న, నసీర్, నడ్పి నాగన్న, గోపాల్, పోశెట్టి, మక్కన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. నందిపేట మండలంలోని శాపూర్‌లో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కె. గంగాదర్, మల్లన్న, రాజలింగం, రాములు, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్‌తండాలో అఖిల భారత రైతుకూలీసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకుడు అబ్బయ్య, మాలవత్ గంగాధర్, నయీం, లక్ష్మణ్, నర్సయ్య పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు రాజన్న, నిఖిల్, కిషన్, ఠాగూర్, రాజన్న, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి సస్పెండ్

ఖలీల్‌వాడి: ఆర్మూర్ పట్టణానికి చెందిన ప్రసాద్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ప్రసాద్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మానాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు మంగళవారం బీజేపీలో చేరారు. వారికి బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ పార్టీ కండువాలు వేసి, బీజేపీలోకి ఆహ్వానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, నాయిడి రాజన్న, సవిత, కొత్తూరి సురేష్, జగత్ సింగ్, చిన్ను, సందీప్ గౌడ్ ఉన్నారు.

జీవన్ రెడ్డిది వెన్ను పోటు చరిత్ర



బోధన్‌లో మాట్లాడుతున్న అర్వింద్



నూత్‌పల్లిలో మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్

బోధన్‌టౌన్/ డొంకేశ్వర్/ ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రోహింగ్యాలకు అడ్డాగా మారుతుందని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిది వెన్ను పోటు చరిత్ర అని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. 1985లో నాదేండ్ల భాస్కర్‌రావును గద్దెను ఎక్కించేందుకు మద్దతుగా ఎన్టీఆర్‌కు వెన్ను పోటు పొడిచిన ఘనత జీవన్ రెడ్డిది అని ఎద్దేవా చేశారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో అర్వింద్ మాట్లాడారు. నరేంద్ర మోదీతోనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి, గంగాసముందర్ గ్రామాల్లో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చాయ్‌పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. అర్హులైన పేదలకు ఇండ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు ఇప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడుతానని అన్నారు. ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి అర్వింద్‌ను గెలిపించాలని కోరారు. ఆర్మూర్ పట్టణంలోని 3వ వార్డులో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు



నికాల్‌పూర్‌లో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి



రుద్రూర్‌లో రవీందర్ రెడ్డి

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి
- గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

డొంకేశ్వర్/ నందిపేట్/ రుద్రూర్/ బాల్కొండ/ బోధన్ టౌన్: ఎన్నికల కోడ్ ముగియగానే రైతు భరోసా కింద కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వనుందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. డొంకేశ్వర్, నికాల్‌పూర్, తొండాకూర్ గ్రామాల్లో మంగళవారం ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. నందిపేట మండల కేంద్రంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పాలనలోనే రైతులు క్షేమంగా ఉంటారని అన్నారు. రుద్రూర్, కోటగిరి, పొతంగల్ మండలాల్లోని గ్రామాల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన సమక్షంలో పొతంగల్ మండలం టాక్లీ గ్రామానికి చెందిన పలు పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కురుక్షేత్రంలో పాండవులు గెలిచినట్లే.. ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బోధన్ పట్టణంలోని నాలుగో వార్డులో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోహినుద్దీన్, కౌన్సిలర్ శరత్ రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: కాంగ్రెస్‌తోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ అన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.



బాల్కొండలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి



పొతంగల్‌లో మాట్లాడుతున్న సురేశ్ షెట్కార్

కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోయింది



జానకంపేటలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్



వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ఎడపల్లి: ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై నమ్మకం పోయిందని మాజీ సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనలో వచ్చిన ప్రజా స్పందనను చూసి అర్థమవుతోందని జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండలంలోని జానకంపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మాజీద్, చేపూరి శ్రీనివాస్, క్రాంతి, శేఖర్ రాజు, అజయ్ గౌడ్, పెరిక రవి, రాంబాబు, కరుణాకర్, గంగాప్రసాద్ యాదవ్, సరికల సందీప్ తదితరులు ఉన్నారు.

వేల్పూర్‌లో..

వేల్పూర్: ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు.

వడదెబ్బపై అవగాహన

ఇందల్వాయి: ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రోగులకు, గర్భిణులకు వడదెబ్బపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్‌ఈవో శంకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ధ్యాన మందిర నిర్మాణానికి భూమి పూజ



నవీపేట: మండలంలోని నారాయణ్‌పూర్‌లో పిరమిడ్ స్పిరిచ్‌వల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(పీఎస్‌ఎస్‌ఎం) ఆధ్వర్యంలో నిర్మించే ధ్యాన మందిరానికి గ్రామ పెద్దలు మంగళవారం భూమి పూజ చేశారు. గ్రామస్తులు విరాళంగా ఇచ్చిన ప్రదేశంలో ధ్యాన మందిరాన్ని నిర్మిస్తున్నట్లు సొసైటీ జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి పేర్కొన్నారు. ధ్యానంతో కలిగే లాభాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బినోల సొసైటీ మాజీ చైర్మన్ వక్కెర్ల కిశోర్ రావు, రిటైర్డ్ డీపీవో బొడ్డు దయానంద్, ఇందిర, భాస్కర్‌రావు, లక్ష్మణ్‌రావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యోగా శిక్షణ



రుద్రూర్: మండల కేంద్రంలోని పతంజలి యజ్ఞ సహిత యోగా కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా, వ్యక్తిత్వ వికాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు వేద గణితం, కర్రసాము, సంస్కృత సంభాషణంపై అవగాహన కల్పిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం పేర్కొన్నారు. ఆధ్యాత్మిక వికాసాన్ని పెంపొందించడానికి యోగా, ప్రాణాయామం, ధ్యానంపై శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – మంజుమ్మల్ బాయ్స్ - 01.05, 7.00; టిల్లు స్క్వేర్ - 4.00, ఈబరి (తెలుగు) - 10.15
- స్క్రీన్-2 – ప్రసన్నవదనం (తెలుగు)- 12.40, 6.40, 9.45; మంజుమ్మల్ బాయ్స్ - 3.45
- స్క్రీన్-3 – ఆ ఒక్కటీ అడక్కు - 12.30, 3.25, 6.20, 9.15
- స్క్రీన్-4 – బాక్ (తెలుగు)- 12.00, 3.10, 6.20, 9.30